| పుస్తక పరిచయం | చైనా సాంస్కృతిక విప్లవం ప్రముఖుల వ్యాసాలు |
|---|---|

**12** వ్యాసాలతో కూడిన 136 పేజీల పుస్తకం యిది. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌వారు 2018 ఫిబ్రవరిలో దీనిని ప్రచురించారు. ఇందులోని చివరి రెండు వ్యాసాలు మినహా మొదటి పదీ 'జనశక్తి' దినపత్రికలో వెలువడ్డాయి. నేటి పాఠకులకు 'జనశక్తి' దిన పత్రిక అనగానే కొంత ఆశ్చర్యం కలిగించవచ్చు కానీ అది నిజం.

ఎ.బి.కె.ప్రసాద్ సంపాదకులుగా 1963 నడిమధ్యన ప్రారంభమైన 'జనశక్తి' మొదట వారపత్రికగా వెలువడేది. 1964 తర్వాత వారానికి రెండు (ఆది-బుధ) చొప్పున వెలువడగా 1966 సెప్టెంబరు నుండీ దినపత్రికగా విడుదలయింది.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో అంతర్జాతీయ - జాతీయ రివిజనిజాలకు వ్యతిరేకంగా సాగిన ఆంతరంగిక పోరాట ఫలితంగా ఆనాటి ఉమ్మడి పార్టీ పత్రిక 'విశాలాంధ్ర' నుండి తప్పని పరిస్థితులలో బయటకు వచ్చి, తర్వాత కాలంలో సి.పి.ఐ(యం)గా రూపొందిన క్రమంలో పుట్టిన పార్టీ పత్రిక 'జనశక్తి'. నాడు కమ్యూనిస్టు ఉద్యమంలో అంతర్జాతీయంగా 'రష్యా-చైనా' పార్టీల నడుమ తీవ్రంగా సాగుతూండిన సిద్ధాంత -రాజకీయ సంఘర్షణలో మౌలికంగా చైనా కమ్యూనిస్టు పార్టీ(సి.పి.సి) విధానాలను జనశక్తి పత్రిక (సి.పి.ఐ-యం) సమర్ధిస్తూండిన కాలం నాటి వ్యాసాలివి. ఈ పుస్తకం ముందుమాటలో ప్రచురణకర్తలు చెప్పినట్లు "చైనా సాంస్కృతిక విప్లవాన్ని సమర్ధిస్తూ వివరిస్తూ రాసిన సి.పి.యం. నాయకులు సంవత్సరం తిరిగే సరికి మౌనం వహించారు".

చైనాలో 1966లో ప్రారంభమయిన సాంస్కృతిక విప్లవం గురించి నాటి చైనా ప్రధాని కామ్రేడ్ చౌ-ఎన్-లై 1968 జూన్ 27న అల్బేనియాలో వివరించిన ప్రసంగంలోని కొన్ని భాగాలనూ, విలియం హింటన్ చౌ-ఎన్-లైతో 1971లో చేసిన ఇంటర్వ్యూని ఆనాటి చైనా కమ్యూనిస్టు పార్టీ, చైనా ప్రభుత్వంయొక్క అధికారిక వైఖరిగా మనం తీసుకోవచ్చు. చైనాలో పర్యటించి సాంస్కృతిక విప్లవాన్ని ప్రత్యక్షంగా చూచి రాసిన పాశ్చాత్య మేధావులు జోన్ రాబిన్‌సన్ (బ్రిటీషు ఆర్థికవేత్త), డేవిడ్ క్రూక్, అమెరికా జర్నలిస్టులయిన ఫెలిక్స్‌గ్రీన్ - హాన్‌సుయిన్ వ్యాసాలను ఆనాడే 'జనశక్తి' పత్రిక ప్రచురించింది.

రాజకీయంగా పేర్కొనదగిన ముఖ్యాంశ మేమంటే ఆనాటి సి.ఐ.ఐ(యం) ముఖ్య నాయకులైన కామ్రేడ్స్ మాకినేని బసవపున్నయ్య, ఇ.యం.ఎస్. నంబూద్రిపాద్, మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావులు చైనాలో నాడు సాగుతూండిన సాంస్కృతిక విప్లవ ఆవశ్యకతను సమర్ధిస్తూ, వివరిస్తూ రాసిన వ్యాసాలు ఈ పుస్తకంలో వున్నాయి. సంవత్సరం తిరిగేసరికి వారు మౌనం వహించటమేకాక తర్వాత కాలంలో వీటిని వదిలేసుకున్నారా(డిస్ ఓన్) అన్నట్లు వుండిపోయారు. అంతేకాక 50 సంవత్సరాలనాడు చైనాలో సాగిన సాంస్కృతిక విప్లవాన్ని ఒక చారిత్రక వాస్తవంగా కూడా పరిగణించకుండా, నూతన తరాలకు నాటి సంఘర్షణాత్మక వర్గపోరాట చరిత్రను పరిచయం చేయటానికి కూడా సంసిద్ధులు కాకపోవటాన్ని కొత్త తరాలు గమనిస్తాయనీ, ఏదో వొక నాటికి జవాబు యిచ్చుకోక తప్పదనీ చెప్పాల్సి వుంది.

**చైనా సాంస్కృతిక విప్లవం- చారిత్రక ప్రాముఖ్యత**

కార్మికవర్గ మహోపాధ్యాయులు కారల్ మార్క్సు - ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు 'కమ్యూనిస్టు ప్రణాళిక'ను రచించి 170 సంవత్సరాలు పూర్తయింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అత్యంత ఆవశ్యకమైన కార్మికులు, రెక్కలకష్టం తప్ప వ్యక్తిగత ఆస్తుల్లేని ఆధునిక సామాజిక వర్గంగా సంఘటితపడి, వర్గసంఘర్షణ ద్వారా కార్మికవర్గ రాజ్యాలను నిర్మించుకునే కాలం సమీపించిందని కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పి వున్నారు. వారి చారిత్రక దార్శనికతను నిజం చేస్తూ మార్క్సు - ఏంగెల్స్‌లు జీవించివుండిన కాలంలోనే, 1871లో ఫ్రాన్స్ దేశపు రాజధాని పారిస్‌లోని కార్మికవర్గం తిరుగుబాటు చేసి, అధికారాన్ని కైవసం చేసుకుంది. అయితే అనేక కారణాలవలన 3 నెలలు మాత్రమే 'పారిస్ కమ్యూన్' నిలబడగలిగింది. దోపిడీ వర్గాల తిరుగు దాడిని తట్టుకోలేని 'పారిస్ కమ్యూన్' ఓటమి పాలయింది.

1917 నవంబరు 7న బోల్షివిక్‌పార్టీ నిర్మాతలైన కామ్రేడ్స్ లెనిన్ - స్టాలిన్‌ల నాయకత్వాన సోవియట్ విప్లవం విజయ వంతమైంది. 1949 అక్టోబరు 1న చైనాలో కామ్రేడ్ మావో నాయకత్వాన, చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్మించిన నూతన ప్రజాస్వామిక విప్లవ సంఘటన అధికారంలోకి వచ్చింది.

1953లో కామ్రేడ్ స్టాలిన్ చనిపోయిన తర్వాత 1956లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ (సి.పి.ఎస్.యు) 20వ మహాసభలో రివిజనిస్టు కృశ్చేవ్ తన సైద్ధాంతిక - రాజకీయ దిగజారుడుతనాన్ని బయటపెట్టుకున్నాడు. సోవియట్ యూనియన్లో పెట్టుబడిదారీ పునరుద్ధరణకు ఆద్యుడయినాడు. మరొకవైపు కామ్రేడ్ స్టాలిన్‌యొక్క మహత్తర కార్మికవర్గ విప్లవ పాత్రకు, మసిబూసి ప్రపంచ మంతా ఆయనొక్క రాక్షసునిలా భావించేట్లు క్రూర పరిహాసమాడాడు. సోవియట్ యూనియన్లో పెట్టుబడిదారీ పునరుద్ధరణకు అధికారిక ఆమోదాన్ని కృశ్చేవ్ నాయకత్వం యిచ్చింది. అంతేకాక వర్గపోరాట రాజకీయాలకు బదులు దోపిడీ వర్గాలతో, సామ్రాజ్యవాదులతో శాంతియుత సహజీవన రాజకీయాలను మార్క్సిజం-లెనినిజం పేరిట అమలులోకి తెచ్చాడు. స్టాలిన్ కాలంలో సమష్టి వ్యవసాయ నిర్మాణాన్ని, సోషలిస్టు విధానాలను అమలుపరచ పూనుకున్నాడు, పాత కాలపు దోపిడీవర్గాలూ, కొత్తరూపాల్లో ఎదుగుతున్న పెటీబూర్జువా శక్తులూ, అవకాశవాదులూ పలు విధాలైన ఆటంకాలను,ఆంతరంగిక

కల్లోలాలను సృష్టించటానికి ప్రయత్నించకపోలేదు. అనేక ఒడిదుడుకుల మధ్య వాటిని తట్టుకుంటూ, అణచివేస్తూ రెండవ ప్రపంచయుద్ధాన్ని ప్రజా యుద్ధంగా మలిచి విజయం సాధించి సోవియట్ యూనియన్లో సోషలిస్టు వ్యవస్థను కాపాడు కున్నారు. చైనాలో కూడా జాతీయ పెట్టుబడిదారులతో కూడిన నూతన ప్రజాతంత్ర ప్రభుత్వం ఒకవైపున సామ్రాజ్యవాదుల, బడా బూర్జువాల(దళారీ), భూస్వామ్యవర్గాల దోపిడీని అంతం కావించినప్పటికీ వ్యక్తిగత ఆస్తుల సమాజం కొనసాగించక తప్పని పరిస్థితి. పాత సమాజపు ప్రధాన దోపిడీశక్తులను తుడిచి పెట్టి, భూసంస్కరణలు అమలుజరిపి, జాతీయ పెట్టుబడిదారులకూ, చిన్న ఉత్పత్తిదారులకూ, వ్యాపారాల అభివృద్ధికీ సానుకూలమైన నూతన ప్రజాతంత్ర వ్యవస్థ నిర్మాణమయింది కనుకనే మొదట పెద్ద అంగలతో అభివృద్ధి సాగింది. ఇది ఒక దశకు వచ్చేసరికి చైనా పెట్టుబడిదారీ మార్గాన సాగాలా, సోషలిస్టు వ్యవస్థగా మారాలా అనే తీవ్రసమస్యగా ముందుకు వచ్చింది. నిజానికి వ్యక్తిగత ఆస్తులుకలవారు మొత్తం జనాభాలో నూటికి పదిమంది కూడా లేకపోయి నప్పటికీ, వారికి గల పాత సమాజపు భౌతిక- సాంస్కృతిక శక్తివల్ల సమాజాన్ని పెట్టుబడిదారీ మార్గంవైపుకి మరల్చే ప్రయత్నం సాగించారు. అందునా వారికి చైనా వెలుపలగల సామ్రాజ్యవాద శక్తుల అండదండలేకాక సోవియట్ యూనియన్లో అధికారంలోకొచ్చిన సోషల్ సామ్రాజ్యవాదులైన రివిజనిస్టుల మద్దతు కూడా వుండింది. ఆవిధంగా చైనా సమాజం పెట్టుబడిదారీ పంథాలో సాగాలనే దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా సోషలిస్టు పంథాలో నడవాలనే మార్క్సిస్టు - లెనినిస్టు - మావో అనుచరులైన విప్లవ శక్తులు సాగించిన సంఘర్షణే మహత్తర సాంస్కృతిక విప్లవం. ఇది అంతర్జాతీయ ప్రాముఖ్యతకల వర్గపోరాటం. అధికారంలో వున్న కమ్యూనిస్టు పార్టీ, దాని మహానాయకుడు మావో, (పెట్టుబడిదారీశక్తుల) అధికారిక కేంద్రాన్ని బద్దలుకొట్టండి (Bombard the Head Quarters) అంటూ పిలుపిచ్చిన పోరాటమది.

అప్పటికే చైనా కమ్యూనిస్టు పార్టీలో రివిజనిజానికీ - మార్క్సిజానికీ; పెట్టుబడిదారీ అనుయాయులకూ సోషలిస్టు మార్గీయులకూ నడుమ - రెండు పంథాల నడుమ-సంఘర్షణ నిరంతరాయంగా సాగుతూ వుండినప్పటికీ, 1966వ సంవత్సరంలో అది బాహాటంగా, ప్రజాఉద్యమంగా కళాసాహిత్య రంగాలలో (భావవిప్లవ రంగాలలో) ప్రారంభమై సాంస్కృతిక విప్లవంగా పేరుగాంచింది.

**ఈ పుస్తకం ఏం చెబుతోంది?**

ఇందులోని వ్యాసాలు సాంస్కృతిక విప్లవ ఆరంభకాలంనాటి ఆలోచనలను, అవగాహనలను, వానిపట్ల సానుకూలతనూ వ్యక్తం చేసేవి మాత్రమే. మొత్తంగా సాంస్కృతిక విప్లవంమీద సమీక్ష చేసిన వ్యాసాలు కాదుగానీ అందుకు మనకు తోడ్పడే వ్యాసాలు ఇవి. సాంస్కృతిక విప్లవ అనుభవాలు-గుణపాఠాలను లోతుగా వెలికితీసి భవిష్యత్తుకు ఒక స్పష్టమైన మార్గనిర్దేశం చేసేది కాదు. అయితే స్థూలంగా మావో నాయకత్వాన చైనా కమ్యూనిస్టుపార్టీ 52 సంవత్సరాల క్రితం ప్రారంభించిన (1966 జూన్) మహత్తర సాంస్కృతిక విప్లవపు చారిత్రక ఆవశ్యకతను స్వాగతిస్తూ, 'జనశక్తి' పాఠకులకు కమ్యూనిస్టు కార్యకర్తలకు దాన్ని అర్థంచేయిస్తూ వర్గసంఘర్షణ యొక్క సిద్ధాంత - రాజకీయ - ఉద్యమ సరికొత్త రూపాలను పరిచయంచేస్తూ సాగిన వ్యాసాల సంకలనం ఈ పుస్తకం. పెట్టుబడిదారీ పునరుద్ధరణకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు శ్రేణులనూ, ప్రజలనూ భావజాలపరంగా, భౌతికంగా సంసిద్ధులను కావించుకోవాల్సిన, ఉద్యమింపచేయాల్సిన ఆవశ్యకతను గుర్తించేట్లు చేసే వ్యాసాలివి. 1967లో తెలుగులో పుస్తక రూపంలోకి వచ్చిన 'చైనాలో సాంస్కృతిక విప్లవం' అనే పత్రాన్ని ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చు కోవాలి. 60 పేజీల ఆ పుస్తకం చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ 1966 ఆగస్టు 1 నుండి 12వ తేదీ దాకా నిర్వహించిన సమావేశపు నిర్ణయ సారం. అలాగే చైనా కమ్యూనిస్టుపార్టీ నిర్వహణ లోని పీపుల్స్‌డైలీ, రెడ్‌ఫ్లాగ్‌ల సంపాదకీయం -సోషలిస్టు పంథా, పెట్టుబడిదారీపంథా-కూడా ఆనాటి చైనా కమ్యూనిస్టుపార్టీ అధికారిక పత్రాలుగా మనం పరిగణించి సాంస్కృతిక విప్లవపు ఆవశ్యకతను - చారిత్రకతను అర్థం చేసుకోవాలి.

ఇపుడు ఈ సంకలనంలోని వ్యాసాలలో స్థూలంగా ఏమున్నదో చూద్దాం. అయితే గమనంలో వుంచుకోవాల్సిన ముఖ్యాంశమేమంటే, వర్గ పోరాటంయొక్క ప్రతి చారిత్రక సందర్భంలోనూ కొంత హెచ్చుతగ్గులతో తలెత్తే అతివాద - మితవాద ధోరణులకు సాంస్కృతిక విప్లవం కూడా అతీతంకాదు. లీషావ్ చీ అనుకూల మితవాదశక్తులే 'రెడ్‌గార్డ్స్'లో పొడచూపిన అతివాదులను బలపరిచినట్లు గమనించగలం. అమెరికాలోని బూర్జువా అనుకూల పత్రికలు కూడా ఈ అతివాత - మితవాదశక్తులపట్ల సానుకూలతను ప్రదర్శించినట్లు విలియం హింటన్ వ్యాసాలద్వారా అర్థమవుతుంది.

**చౌ-ఎన్-లై వ్యాసాలలో ఏం వుంది?**

1968 జూన్ 27న అల్బేనియా దేశ రాజధాని టిరానాలో చౌఎన్‌లై చేసిన ప్రసంగం లోని కొన్ని భాగాలు నాటి(1968) జనశక్తిలో వెలువడిన వ్యాసం ఈ పుస్తకంలో మొదటిదిగా వుంది. అలాగే వ్యాసాలలో 12వ దీ, చివరిదీ చౌ-ఎన్-లైతో అమెరికా జర్నలిస్టు, రచయిత విలియం హింటన్ 1971లో చేసిన ఇంటర్వ్యూ. ఆనాటికి జనశక్తి పత్రిక బహిరంగంగా వెలువరించే స్థితి లేదు కనుక, తర్వాత కొంత కాలానికి (1975లో) పుస్తక రూపంలో అది వెలువడింది.

ఈ సందర్భంగా పాఠకులు గమనంలో ఉంచుకోవాల్సిన వొక ముఖ్యాంశాన్ని గుర్తు చేసుకోవటం అవసరం. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాదయుగంలోకి అడుగిడిన కాలంలో, పరాధీన దేశాలలో అనగా భారతదేశంలాంటి వలస - చైనాలాంటి అర్థవలస దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విప్లవం విజయవంతం కాకుండా వాటి చారిత్రక పురోగమనం సాధ్యం కాదు. అయితే సామ్రాజ్యవాదం ఆయా వలస-అర్థవలసల్లోని కాలం చెల్లిన భూస్వామ్య వ్యవస్థను తన సాంఘిక పునాదిగా చేసుకొని తమ దళారీలను సృష్టించుకుని ఆ సమాజాల్ని ఆర్థికంగా- సాంఘికంగా అణచివుంచే రాజకీయాల్ని అనుసరిస్తోంది కనుక, ఈలాంటి దేశాలలో సోషలిజాన్ని నేరుగా సాధించటం సాధ్యంకాదు. సోషలిస్టు విప్లవ దశకు ముందు

నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని విజయవంతం కావించు కోవాల్సిన చారిత్రక అనివార్యత కార్మికవర్గానికి ఏర్పడింది. నిజానికి భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామ్య విప్లవాల్ని ఐరోపా ఖండంలో 18-19 శతాబ్దాలలో ఆ దేశంలోని బూర్జువా వర్గం నడిపించింది. పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధానంగా - అదే ఫైనాన్స్ పెట్టుబడిగా - సామ్రాజ్యవాదంగా పెరిగి వెనుక బడిన దేశాలలోకి విస్తరించుకునే క్రమంలోనే వలస-అర్థవలస దేశాలుగా వాటిని లోబరుచుకో గలిగారు. కనుక ఆ దేశాలలోని విప్లవాలు సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ స్వభావాన్నీ, ఫ్యూడల్ వ్యతిరేక ప్రజాతంత్ర స్వభావాన్నీ కలిగి వుండినాయి. బూర్జువావర్గంలో బలమైన ముఠా సామ్రాజ్యవాదంతో షరీకయి దళారీలుగా మారిన కారణంగా, ఆయా వలస - అర్థవలస దేశాలలో కార్మికవర్గమే నూతన ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాల్సిన చారిత్రక ఆవశ్యకత ఏర్పడింది.

చైనా విషయంలో విప్లవం 1949 వరకు నూతన ప్రజాస్వామిక విప్లవ దశగానూ, అది విజయవంతమయిన తర్వాత సోషలిస్టు విప్లవ దశలోకీ ప్రవేశించినట్లుగా మనం అర్థం చేసుకోవాలి.

**కామ్రేడ్ చౌఎన్‌లై 1968లో చెప్పిన విషయాలను యిప్పుడు చూద్దాం.**

- సోషలిజం ఒక సుదీర్ఘ చారిత్రక యుగమని కామ్రేడ్ మావో మనకు చెబుతున్నాడు.
- సోషలిస్టు పరివర్తనచెందే దాకా, సోషలిస్టు సమాజంలో కూడా ఇంకా వర్గాలు, వర్గవైరుధ్యాలు వుంటూనే వుంటాయి.
- వర్గపోరాటం యొక్క రూపం మారి పోతుంది. వర్గ పోరాటం ఇంకా పూర్తయినట్టుగా లెక్కించకూడదు.
- పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరింపబడే ప్రమాదం ఈ దశ అంతటిలోనూ వుంటుంది. అలాంటి ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయటంకానీ, అలాంటి ప్రమాదం లేదని నిరాకరించటంగానీ పూర్తిగా పొరపాటు.
- సమష్టి యాజమాన్యాన్నీ, ప్రజలందరి సోషలిస్టు యాజమాన్యాన్నీ దృఢతరం చేయడానికి, ఉత్పత్తిని పెంపొందించ టానికి ఈ ఉద్యమం మూలంగా జరిగిన మేలు ఎనలేనిది.
- విద్యార్థులు ప్రధానంగా వారి విద్యపైనే కేంద్రీకరించాలి. అయితే వారు యితర విషయాలు కూడా నేర్చుకోవాలి. అంటే వారు సంస్కృతిని అధ్యయనం చేస్తేనే సరిపోదు. వారు పారిశ్రామిక కార్మికులు గానూ, రైతులుగానూ, సైనికులుగాను పని చేయగలిగే శక్తిని కూడా సంపాదించాలి. పాక్షికంగా చదువు, పాక్షికంగా పని పూర్తిగా అమలు పరచబడుతుంది. (1958-59 సంవత్సరాల నుండి యిది అమలులో వుంది).
- చైనా సిద్ధాంత రంగంలో చాలా నిశితమైన వర్గపోరాటం చేసింది. ప్రస్తుత వర్గ పోరాటం ద్వారా తిరిగి ప్రాబల్యానికి రావాలనే బూర్జువావర్గ ఏజెంట్ల కుట్రలకూ, అలాంటి వాటిని వమ్ము చేయాలనే ప్రయత్నాలకు - ఈ రెండు రకాల ప్రయత్నాలకు నడుమ జరిగే పోరాటమే సాంస్కృతిక విప్లవం.
- ఈ శ్రామిక ప్రజల సాంస్కృతిక మహా విప్లవం మానవ చరిత్రలోనే అపూర్వ మయినది. ఇది ప్రపంచ ప్రజలకు మహత్తరమైన ఆశాజ్యోతి. సామ్రాజ్య వాదానికి, అన్ని దేశాల అభివృద్ధి నిరోధకులకు ఇది గొడ్డలిపెట్టు.
- చైనా ప్రజలకు దీర్ఘకాల విప్లవ పోరాట అనుభవం వున్నది. కామ్రేడ్ మావో ఆలోచనా ధోరణి అత్యంత శక్తివంతమైన ఆయుధమని వారు అర్థంచేసుకోగలిగారు. పార్టీయొక్క రాజ్యాంగయంత్రంయొక్క నాయకత్వం రివిజనిస్టుల హస్తగతమయ్యే ప్రమాదాన్ని, పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదాన్ని ఎలా నివారించాలో సోషలిస్టు దేశాలకు ఇంకా సరైన అనుభవం లేదు. ఈ అనుభవాన్ని సృష్టించే చారిత్రక కర్తవ్యం ప్రస్తుత యుగపు మార్క్సిస్టు- లెనినిస్టుల భుజస్కంధాలపైన పడింది.

ఇక్కడ మనం గుర్తుకుతెచ్చుకోవాల్సిన ఒక విషయం ఏమంటే, 1962 సెప్టెంబరులో జరిగిన చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ సమావేశంలోనే పెట్టుబడిదారీ పునరుద్ధరణకు వ్యతిరేకంగా నిఘా పెట్టమని కామ్రేడ్ మావో నొక్కి చెప్పారు. వర్గవైరుధ్యాలు ఇంకా వున్నాయనీ పోరాటం సుదీర్ఘమైనదనీ, సంక్లిష్టమైనదనీ చెప్పారు.

**సోషలిస్టు ప్రభుత్వ సుస్థిరతకై సాంస్కృతిక విప్లవం**

సాంస్కృతిక విప్లవం మొదలైన సంవత్సరం - 1966లోనే ఆనాటి సి.పి.ఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు **కామ్రేడ్ నండూరి ప్రసాదరావు** దీనిపై ఇలా రాశారు:

"బూర్జువా సమాజంలో వ్యక్తుల, గ్రూపుల మధ్య అధికారం కొరకు పెనుగులాట సహజం.... వాస్తవానికి చైనాలో జరిగేది సిద్ధాంత, రాజకీయ పోరాటమే గాని, వ్యక్తులమధ్య అధికారం కొరకు జరిగే పెనుగులాట కాదు. చైనా సోషలిస్టు మహావిప్లవంలో ఒక దశనుండి మరొక దశకు పరివర్తన చెందే కాలంలో పురోగామిశక్తులకూ, తిరోగామి శక్తులకూ జరిగే సిద్ధాంత - రాజకీయ పోరాటాన్ని వక్రంగా చూపెట్టటంలో బూర్జువా వర్గాల ఉద్దేశం స్పష్టమే. సిద్ధాంత - రాజకీయ సమస్యలనుండి, విధానాలనుండి ప్రజల దృష్టిని మరల్చటమే, సంఘర్షణ అసలు స్వరూపాన్ని, కారణాలనూ మరుగుపర్చటమే వారి ఉద్దేశం".

చైనాలో నాడు సాగుతున్న 'పురోగామి- తిరోగామి శక్తుల' నడుమ సంఘర్షణను (చైనా దేశాధ్యక్షుడైన లీషావ్ చీకి వ్యతిరేకంగా జరుగుతున్న సాంస్కృతిక విప్లవాన్ని), 1930ల కాలంలో సోవియట్ యూనియన్లో బుఖారిన్‌కు వ్యతిరేకంగా స్టాలిన్ నాయకత్వాన జరిగిన పోరాటంతో పోల్చి రాశారు. ఆనాటి **బుఖారిన్ గొప్ప సిద్ధాంతవేత్తగా** అని గుర్తు చేశారు. ఇంకా **ట్రాట్స్కీ-జినోవీవ్‌ల కుట్రలు** గురించి చెప్పారు. నాడు ఈ మహా మహా నాయకులకు వ్యతిరేకంగా స్టాలిన్ చేసిన పోరాటాన్ని బోల్షివిక్ పార్టీ చరిత్ర నుండి ఉదహరించారు. హంతక ముఠాలుగా మారిన ట్రాట్స్కీ-జినోవీవ్ -బుఖారిన్ ముఠాలు విదేశీ గూఢచారులతో మిలాఖత్ అయిన విధ్వంస కారులని చెప్పారు.

సమాజం ముందగుగువేస్తున్న దశలోనే సిద్ధాంత, రాజకీయ సంఘర్షణలు తప్పవని నిర్ధారిస్తూ - సోవియట్ యూనియన్లో "వ్యవసాయాన్ని అంతటినీ సమష్టి వ్యవసాయ పద్ధతిలోకి పరివర్తన గావించుకున్న కాలంలోనే, సమాజంలో దాక్కొని

వున్న పెట్టుబడిదారీ- భూస్వామికశక్తులు విధ్వంసకర చర్యలను సాగించాయి. ఆర్థిక జీవితంలో అల్లకల్లోలాన్ని సంక్షోభాన్ని తెచ్చిపెట్టజూశారు" అంటూ - **అవకాశవాదాన్ని నిశ్చింతగా ఎదిరించాలి** అని విస్పష్టంగా ప్రకటించారు. చైనాలో నాడు సాంస్కృతిక విప్లవం ఆవశ్యకమైనదని సమర్థిస్తూ ఆ వ్యాసమంతా సాగింది.

ఆనాటి సి.పి.ఐ.(యం) ప్రధానకార్యదర్శి కామ్రేడ్ సుందరయ్య-**రాజకీయంగా, ఆర్థికంగా సోషలిస్టు విప్లవాన్ని సాధించటమే కాదు; సామాజికంగా, సాంస్కృతికంగా ఆ విప్లవ పురోగమనాన్ని కొనసాగించడానికి 70 కోట్ల దేశం పూనుకుని సాగిస్తున్న మహత్తర ప్రయోగం విజయం పొందాలని**-ప్రకటించినట్లు 1967లో రవి పేరుతో **కా॥మోటూరు హనుమంతరావు** వ్రాసిన వ్యాసంలో ఉటంకించారు. దీనిని విమర్శించిన రివిజనిస్టుల వక్రీకరణలను ఖండిస్తూ ఈ వ్యాసం సాగింది. మన స్థానిక రివిజనిస్టులేకాక సోవియట్ యూనియన్లోని కృశ్చేవ్ ముఠా, నాటి సోవియట్ రివిజనిస్టు పార్టీ కూడా దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఈ వ్యాసంలో పేర్కొన్నారు. చైనాలో సాగుతూండిన సాంస్కృతిక విప్లవ సంఘర్షణను ఆనాటి భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) సమర్థిస్తూ వుండినదని ఈ వ్యాసం ద్వారా పాఠకులు అర్థంచేసుకోగలుగుతారు.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కాలంనుండీ మార్క్సిస్టు సిద్ధాంతకర్తగా పేరుపొందిన **కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య** జనచైనా అవతరించిన 17వ వార్షికోత్సవం సందర్భంగా (1-1- 1966న) రాసిన 16 పేజీల వ్యాసంలోని కొన్ని ముఖ్యమైన వాక్యాలు చూద్దాం.

**<u>చైనా సాంస్కృతిక మహావిప్లవ విశిష్టత</u>**

- అటు శ్రామికవర్గమైనా సాంస్కృతిక విప్లవాన్ని నడపాలి; లేదా అది విప్లవ ప్రతీఘాతుకత్వానికైనా సంసిద్ధమై వుండాలి. ఈ రెండు పద్ధతులు వినా(కాకుండా) మరో మార్గం లేదు. ఉండబోదు కూడా.
- ప్రైవేటు ఆస్తిని కలిగిన బూర్జువావర్గం, ప్రైవేటు ఆస్తికలిగిన మరొక(భూస్వామ్య) వర్గంపై ఆధిక్యత సంపాదించటానికే ఎంతో పోరాటం చేయవలసి వచ్చింది. వర్గ విభేదాలన్నిటినీ అంతంచేసి వర్గరహిత సమాజ నిర్మాణాన్ని గావించడానికి కార్మికవర్గం జేసే పోరాటం ఇంతకంటే వెయ్యిరెట్లు భయంకరంగా వుంటుందని ఊహించటం కష్టమేమీకాదు.
- బూర్జువా భావజాలాలను - జీవితపు అలవాట్లను, వ్యక్తి, సంఘం, కళ, సాహిత్యం మొదలైన విషయాలను గూర్చిన బూర్జువా అభిప్రాయాలను సమూలంగా పెరికివేయాలి. ఇది చైతన్యయుతమైన, మంచి నిర్మాణాత్మకమైన, సుదీర్ఘమయిన, సుసంఘటితమయిన పోరాటం ద్వారానే సాధ్యం.
- నవచైనాలో బ్రహ్మాండమైన సోషలిస్టు నిర్మాణమూ, సోషలిస్టు పరిశ్రమల బ్రహ్మాండమైన విజయాలకూ వ్యతిరేకంగా, అణగారియున్న పెట్టుబడిదారీశక్తులు ప్రతిఘటించ తలెత్తాయి. అలా జరగటం సహజమేకాని, అసహజంకాదు. విప్లవం మధ్యలో నిలిచిపోవాలనుకుంటే తప్ప ఈ ప్రతిఘటనను ఎదుర్కొని ముందుకు పోవటం కార్మికవర్గ ప్రభుత్వ ధర్మంకాదా? ఈ వర్గ పోరాటానికే చైనావాళ్ళు మహా సాంస్కృతిక విప్లవమని పేరు పెట్టుకున్నారు.
- సోషలిజం నిర్మాణంలో అదొక బ్రహ్మాండ మైన నూతన ప్రయోగం. వర్తమాన ప్రపంచంలో నివసించే చైతన్యంగల ప్రతి విప్లవకారుడు ఈ ప్రయోగాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తాడు. అధ్యయనం చేస్తాడు. దాని నుండి తగిన గుణపాఠాలు తీసుకుంటాడు.
- అధికారంకోసం జరిపే పోరాటంలో కార్మికవర్గానికి 'నిర్మాణం' కన్నా మించిన ఆయుధం లేదన్నాడు లెనిన్. అలాంటి మహత్తర ఉత్తమ ఆర్గనైజేషన్ కమ్యూనిస్టు పార్టీ. అది ఉక్కు శిక్షణ కల్గి వుండాలి. నిక్కచ్చియైన ఐక్యత వుండాలి. స్థిరమైన సైద్ధాంతిక పునాది వుండాలి.
- సోషలిస్టు నిర్మాణం యొక్క ప్రతిదశలోనూ మానసిక శారీరక శ్రమలమధ్య వున్న పెద్ద గండిని పూడ్చడానికి ఓపికతోనూ, పట్టుదలతోనూ క్రమపద్ధతిన పోరాటాన్ని సాగించి గట్టి చర్యలను తీసుకోవాలి. అలా కానిచో శారీరక శ్రమలయెడల బూర్జువా వర్గ నీచవైఖరి, బుద్ధిజీవుల ఉద్యోగాలని పిలవబడే వాటిలో వుండే సౌకర్యాలయెడ మోజు పెంపుగావటం తథ్యం. అది సోషలిస్టు పురోగమనానికి చేటు. అంతేకాదు పెట్టుబడిదారీ భావాలకు, పెట్టుబడిదారీ జీవిత అలవాట్లకు అది పూర్తిగా కవాటాలను తెరిచే ప్రమాదం కూడా వుంది.
- బూర్జువా మేధావులు తమ విద్యా కేంద్రాలను, విద్యా విధానాన్ని వశం చేసుకోవటానికి చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం అనుమతిస్తుందని ఎవరైనా ఎలా ఆశించగలరు? ఈ బూర్జువా మేధావులు శారీరక శ్రమను, సోషలిస్టు సంస్కృతినీ నీచంగా చూస్తారు.
- ఇంత మహోద్యమంలో లోటుపాట్లు ఏమీ వుండవని ఎవరూ వూహించశక్యం కాదు. చైనా కమ్యూనిస్టులు కూడా ఆవిధంగా చెప్పటంలేదు. అంతేగాదు, కొన్ని సందర్భాలలో తాత్కాలికంగా తిరోగమనం చేయవలసిన అవసరమూ రావచ్చు. ఓటమి కూడా సంభవించవచ్చు. ప్రపంచంలో సామ్రాజ్యవాద వ్యతిరేకి అయిన ప్రతి ఒక్కరూ ఈ మహాయజ్ఞాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. దాని మూలంగా గతించిన అనుభవాలను అధ్యయనం చేయాలి. కమ్యూనిస్టు అయిన ప్రతి వానికి ఇదెంతో అవసరం.
- "రాజకీయాల్లో ప్రజలు వంచనకు, ఆత్మవంచనకు ఎల్లప్పుడూ తెలివి తక్కువగా గురవుతూవచ్చారు. ఈ స్థితిలోనే వుంటే ఇక ముందుకూడా వారావిధంగా ఎల్లవేళలా మోసపోకతప్పదు. సాంఘిక, రాజకీయ, మతైక నీతి ప్రబోధక రంగాలలో వల్లెవేసే నీతి వాక్యాల వెనుక, చేసే వాగ్దానాల వెనుక ఏదో ఒక వర్గం యొక్క ప్రయోజనాలున్నాయనే విషయాన్ని ప్రజలు గ్రహించే వరకూ, వారీవిధంగా మోసపోతూను వుంటారు" అని లెనిన్ మహాశయుడు ప్రవచించాడు. ప్రస్తుతం చైనా సాంస్కృతిక విప్లవ పథానికి వ్యతిరేకంగా ద్వేషపూరిత, నీచాతినీచమైన దూషణలతో గూడిన ప్రచారోద్యమం సాగు తున్నది.

దీనివెనుక ఏ వర్గం ప్రయోజనా లున్నాయో, అవి ఏ వేషంలోనైనా వుండ వచ్చునని గ్రహించటం కష్టసాధ్యమా?

కా॥మాకినేని బసవపున్నయ్య వ్యాసం తరవాతది ఆనాడు సి.పి.ఐ.(యం) రాష్ట్ర కార్యదర్శి **కామ్రేడ్ మోటూరు హనుమంతరావుది.** వీరి వ్యాసంలోనే రివిజనిస్టులపై పదునైన పదజాలాన్ని ప్రయోగించారు. **"వర్గపోరాటానికి తిలోదకాలు వదిలినవారే సాంస్కృతిక విప్లవాన్ని దుయ్యబట్టగలరు"**. తన వ్యాసంలో మహాకవి శ్రీశ్రీ కవిత 'ఖడ్గసృష్టి'(1966లో జనశక్తి దినపత్రికలో ప్రచురింపబడినది) నుండి నాలుగు చరణాలు ఉల్లేఖించారు. ఈ సందర్భంగా వాటిలో రెంటిని మనం చూద్దాం. **"ఆశయం వుండటం మంచిదే కాని/ అన్ని ఆశయాలూ మంచివి కావు/ఆశయాలు సంఘర్షించే వేళ/ ఆయుధం అలీనం కాదు". "ఈ కత్తి/బాజు పట్టిన భావాలకు పునర్జయం ఇవ్వడానికి కాదు/ కుళ్ళిపోతున్న సమాజ వృక్షాన్ని/ సమూలచ్ఛేదం చెయ్యడానికి"** కా॥ మోటూరి వ్యాసం చైనాలో సాగుతున్న సాంస్కృతిక విప్లవాన్ని హేళనచేస్తూ రాతలలో దుష్ప్రచారం కావిస్తూండిన రివిజనిస్టులపై విమర్శ, వివరణలతో సాగింది. అలా ఆయన విమర్శకు గురయిన వారిలో రచయితలు ఇల్యా ఎహ్రెన్‌బర్గ్, కె.ఎ.అబ్బాస్, సి.పి.ఐ.నాయకుడు డాక్టర్ అధికారి వున్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో హంగేరీ ఘటనలనూ, మాస్కోలోగల చైనా దేశపు రాయబారిపై జరిగిన దాడిని ప్రస్తావించారు. ప్రపంచానికి పరమ శత్రువయిన అమెరికా దేశపు అధ్యక్షుడు కెన్నడీ చంపబడితే "కెన్నడీ శాంతికాముకత జిందాబాద్" అంటూ అటు రష్యాలోనూ, ఇటు ఇండియాలోని సి.పి.ఐ. పత్రికలూ రాయటాన్ని తూర్పారబట్టారు. ఈ సందర్భంగా కె.ఎ.అబ్బాస్ వెనకొకసారి రాసిన "మాజీ కమ్యూనిస్టు మరీ పనికిమాలినవాడు" అనే వాక్యంతో రివిజనిస్టుల్ని తిప్పికొట్టారు. సాంస్కృతిక విప్లవాన్ని గురించి రివిజనిస్టు భావాలను విమర్శిస్తూ...

- విచిత్రమేమంటే సామ్రాజ్యవాదులను తలదన్నే విధంగా రివిజనిస్టులు సాంస్కృతిక విప్లవాన్ని చెడ్డదని చిత్రిస్తున్నారు.
- స్టాలిన్ అనంతరం సోవయట్ యూనియన్లో పరిస్థితి తారుమారయింది. కృశ్చేవ్ రివిజనిజం అమాంతం తలెత్తింది. 1920 –40 మధ్యకాలంలో జరిగిన వర్గ పోరాటం, గొప్ప ప్రజాచైతన్యంతో కూడిన ఉద్యమంగా కాక, పార్టీ చైతన్యస్థాయితో గాక జరిగిన ప్రక్షాళనం అవటం చేతనే ఇటువంటి ప్రమాదాలకు ఎప్పుడైనా అవకాశాలుంటాయని చైనా పార్టీ ఇప్పుడీ సాంస్కృతిక విప్లవాన్ని మహత్తరమైన ప్రజాఉద్యమంగా పెంపొందించింది.
- అసలు చైనాలో ఏ నిర్ణయం తీసుకున్నా అది మహత్తరమైన ప్రజాఉద్యమంగా సాగుతోంది.

**నవచైనా అంతర్గత ప్రజాజీవితంలో కలిగిన అభ్యుదయ పరిణామాలు**

ఇది చైనా గురించి అమెరికాలో వుంటున్న ఇంగ్లీషు రచయిత ఫెలిక్స్ గ్రీన్ రాసిన The Wall has Two Sides (గోడకు రెండు వైపు లున్నాయి) అనే పుస్తకంపై **ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్** చేసిన సమీక్ష. 1960వ సంవత్సరంలో ఫెలిక్స్ గ్రీన్ 5 నెలలపాటు చైనాలో పర్యటించి రాసిన పుస్తకమిది. చైనా విముక్తిచెంది 17 సంవత్సరాలు అయిన సందర్భంగా(1966 అక్టోబరు) రాసిన సమీక్షా వ్యాసమిది.

ఈ పుస్తకమేకాక ఫెలిక్స్ గ్రీన్ చైనా, వియత్నాం దేశాధినేతలైన చౌఎన్‌లై, హోచిమిన్ లతో ఇంటర్వ్యూలు జరిపాడు. The Curtain of Ignorance (అజ్ఞానం అనే ఒక తెర) సామ్రాజ్యవాదం, విప్లవాలపై The Enemy (శత్రువు) అనే పుస్తకాలు కూడా రచించివున్నాడు. చైనాపై ఫెలిక్స్ గ్రీన్ తీసిన సినిమా అమెరికాలో కూడా ప్రశంసలనందుకుంది.

మన పరిశీలనలో వున్న సమీక్షా వ్యాసం– ఫెలిక్స్ గ్రీన్ రాసిన The Wall has Two Sides (గోడకు రెండు వైపులున్నాయి) పుస్తకంపై 1966లో నంబూద్రిపాద్ రాసినది. అయితే అప్పటికి 6 సంవత్సరాల ముందు – 1960లో – ఫెలిక్స్ గ్రీన్ చైనాలో పర్యటించి రాసిన పుస్తకమది. అది చైనా–భారత ప్రభుత్వాల నడుమ సంబంధాలు లేని కాలం. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణముండిన కాలం. యుద్ధంలో మొదట బలిఅయేది 'సత్యం' అనే పూర్తిగా నిజమైన నానుడికి నిదర్శనంగా నిలిచిన కాలమది. వార్తా సంస్థలు, పత్రికా విలేఖరుల సమాచారంతప్ప సాధారణ ప్రజల నడుమ రాకపోకలకు ఆస్కారం లేనికాలంలో, ఫెలిక్స్ గ్రీన్ కూడా ఎన్నో దుష్ప్రచారాల సమాచార ప్రభావాలతోనే చైనా దేశాన్ని పర్యటించి రాసిన పుస్తకమది. చైనాపై సాగుతూండిన దుష్ప్రచారాన్ని అనుమానించినా, 'దేశభక్తి లేనివారుగా' చైనా ఏజెంట్లుగా పరిగణింపబడుతూండిన కాలమది.

'గోడకు రెండు వైపులున్నాయి' అనే పుస్తకం 400 పేజీలది. చైనాలో సమష్టి వ్యవసాయాన్ని అభివృద్ధిపరచడానికి కమ్యూన్‌లను అభివృద్ధి పరుచుకున్నారు. వీటిని నిర్ధాక్షిణ్యంగా ప్రజలపై రుద్దారనే దుష్ప్రచారం ప్రపంచ ప్రధాన వార్తా సంస్థలు వ్యాప్తిచేస్తున్న కాలంలో...

"గ్రామాల్లోనూ నగరాల్లోనూ చైనా ప్రజల ఈ సంఘటిత కృషే కమ్యూన్ల స్థాపనకు దారి తీసింది. కమ్యూన్ ఉద్యమం పైనుండి ఎవరో రుద్దింది కాదు. అది సామాన్య ప్రజల విస్తృత చర్చల ప్రాతిపదికపై అభివృద్ధిచెంది పనిచేస్తూ వుంది"అని ఫెలిక్స్ గ్రీన్ అభిప్రాయపడ్డారు.

ఈ కమ్యూన్ల నిర్మాణమూ నిర్వహణలో జరుగుతున్న పొరపాట్లను కాదు మనం చూడాల్సినది, వాటిని సరిదిద్దటానికి, ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రజలు నడుములు బిగించుతున్న తీరుని చూడాలని గ్రీన్ చెప్పారు. "ప్రజాసామాన్యం ఒక ఉద్యమంగా సభలద్వారా, గ్రూపుచర్చల ద్వారా పాల్గొనడమే నేడు చైనా జీవితంలోని విశేష లక్షణం" అనీ ప్రజలను చైతన్యవంతులను చేయటానికీ, వారికి నచ్చ చెప్పటానికీ, నాయకత్వ సమస్యలపై మావో సేటుంగ్ రూపొందించిన సిద్ధాంత కార్య విధానాల పద్ధతి యిది" అంటారు గ్రీన్.

**డా॥హాన్ సుయిన్ – చైనా సాంస్కృతిక విప్లవం**

50 ఏళ్ళ తర్వాత వెలువడిన ఈ పాత వ్యాసాల కొత్త పుస్తకంలో **డా॥హాన్ సుయిన్ రాసిన 'చైనా సాంస్కృతిక విప్లవం'**

వ్యాసం ఒకటి. ఇది ప్రధానంగా ఆనాడు సాంస్కృతిక విప్లవం గురించి ప్రచారమవుతున్న దుష్ప్రచారాలు, కట్టు కథలకు వ్యతిరేకంగా వాస్తవాలు వెల్లడించటానికి పూనుకున్న వ్యాసమిది. ఇందులో ఉపశీర్షికలను పరిచయం చేసుకుంటే సారాంశం పాఠకులకు అర్థంకావచ్చు.

"నిజమైన సాంస్కృతిక విలువలపట్ల గౌరవం"

"సాంస్కృతిక వారసత్వం అంటే ఏమిటి?

"దౌర్జన్యకాండ-మూక పాలన"

"చర్చలు-చర్చలు", "కట్టుకథలు"

"చైనాలో ప్రజాస్వామ్యం గురించి"

"ఇంక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి."

"యువతరం మీదనే మావో విశ్వాసం"

"వియత్నాంకు సాయం"

"చైనా చెప్పే రెండో విషయం యిదీ"

ప్రపంచ ప్రఖ్యాత చైనా వ్యాఖ్యాతగా పేరు పొందిన డా॥హాన్ సుయెన్ ఆనాటికి బ్రిటీషువారి అధీనంలో వుండిన చైనా ప్రదేశమైన హాంకాంగ్‌కు చెందిన మహిళ.

**జోన్ రాబిన్ సన్ అనుభవాలు**

చైనాలో సాంస్కృతిక విప్లవం ఆరంభమైన 1966 జూన్ నుండి 16 నెలలపాటు (1967 అక్టోబరు దాకా) చైనా పర్యటించిన ప్రఖ్యాత బ్రిటీషు మహిళా ఆర్థికవేత్త జోన్ రాబిన్‌సన్ అనుభవాలు సాంస్కృతిక విప్లవతత్వాన్ని అర్థంచేసుకోవటానికి బాగా ఉపకరిస్తాయి.

- రాజకీయాధికారాన్ని అర్థాంతరంగా తిరగ దోడే మాటల్లో చెప్పుకోవాలంటే అదొక విప్లవమే. ఆ విప్లవానికి సారథ్యం వహించింది ప్రజా ఉద్యమం. అది ప్రజల వెల్లువ. ఆ వెల్లువను ప్రోత్సహించి నాయకత్వం యిచ్చింది ఎవరో గాదు. ప్రభుత్వాధినేతయిన ఛైర్మన్ మావోనే! అదొక అపురూపమైన ఘటన. దానికదే సాటి. అందువల్లనే యింతకు పూర్వమే నిర్ణయమైవున్న (భారతదేశం - పశ్చిమ దేశాలలో వలె రాజకీయాల్ని లీగల్ పరిభాషలో మాట్లాడటంవలె) రొడ్డు కొట్టుడు సూత్రాలతో యిది యిమడదు.
- కళాశాలల్లో, విద్యాసంస్థల్లో తొలిగా ఏర్పడిన తిరుగుబాటు గ్రూపులు తర్వాత పారిశ్రామిక సంస్థలలో వెలిశాయి. ఇదంతా మొదటి ఆరు నెలల్లో జరిగింది.
- "పెట్టుబడిదారీ పంథాను చేపడుతున్న అధికారంలో వున్న పార్టీ వ్యక్తులు" ఈ విమర్శను సహించలేకపోయారు. ఈ మితవాదులే తిరుగుబాటుదార్లను విప్లవ ప్రతీఘాతుకులు అని ఎదురు విమర్శకు పూనుకున్నారు. "ఇజాలతో నిమిత్తం లేదన్న" వారు కూడా బయలుదేరారు. ఘర్షణలు పరస్పర భౌతిక దాడుల దాకా వెళ్ళిన సందర్భాలు కూడా వున్నాయి.
- ఇంత తీవ్రస్థాయికి వచ్చేవరకు మావో ఎందుకు వూరుకున్నాడు? అధికారం ప్రజలకు దఖలుపడాలనీ, ప్రజలపై పెత్తనం చేసేవారికికాక సేవచేసే వారికి అధికారం దఖలు పడాలనీ మావో కోరు కున్నాడు. పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ జాగరూకులై వుండే, అధికార దాహాన్ని, దర్పాన్నీ, అవినీతిని కనిపెట్టి త్రుంచివేయగల విజ్ఞానవంతులైన ప్రజలకు అధికారం దక్కాలనీ ఆయన కోరుకున్నాడు.
- కొత్త తరాలలో సోమరితనమూ, స్వంత అవసరాల్ని సమాజావసరాల కన్నా ఎక్కువగా చూసే ప్రమాదానికి మరో తరం గురికాకుండా తప్పించడానికి యిదంతా జరిగింది.
- ఈ పోరాటం సోషలిస్టు అభివృద్ధిని సాధించటానికి పట్టే సుదీర్ఘకాల దశకు ప్రాథమిక దశ మాత్రమేనని పార్టీ కేంద్రకమిటీ స్పష్టంచేసింది. స్వప్రయోజ నాల్ని ఎదుర్కోవటమూ, మనసుల్లోనుండి రివిజనిస్టు తరహా వేళ్ళను పెళ్ళగించటం కొరకు పార్టీలో వున్న పెట్టుబడిదారీ మార్గీయులపై ఎక్కుపెట్టిన పోరాటమిది.

**"నౌ" (ఇప్పుడు) పత్రిక ఏం చెప్పింది**

కలకత్తానుండి 'నౌ' (ఇప్పుడు) అనే పత్రికను కొందరు మేధావులు నడుపుతూండే వారు. చైనా గురించి ఇటీవలి పత్రికల్లో వస్తున్న వార్తలను 'చైనాలో' అన్న శీర్షికతో 10-6- 1966న, 16-9-1966నా సంపాదకీయ వ్యాఖ్యలను ప్రచురించగా 'జనశక్తి'లో వాటి అనువాదం వెలువడింది.

చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ చేసిన ఒక ముఖ్య ప్రకటనను వీటిలో చూడవచ్చు.

- "భిన్నాభిప్రాయం వ్యక్తపరిచే అల్ప సంఖ్యాకులను లొంగదీసుకునేందుకు వారిని బలవంతపెట్టే పద్ధతిని అనుమ తించేది లేదు. అల్ప సంఖ్యాకులకు రక్షణ కల్పించాలి. ఎందుకంటే అల్ప సంఖ్యాకుల మాటలే నిజంగావచ్చు. ఏ కారణం వల్లనైనా సరే ప్రజలను రెచ్చగొట్టటం అనుమతించబడదు".
- "మనం ఈ ఉద్యమాన్ని ఒత్తిడి చేయటం, బలవంతపెట్టటం ద్వారా కాక, వాదనల ద్వారా కొనసాగించాలి. ప్రజలను ఎవరినీ హింసించకండి. పదవులలో వుండి పెట్టుబడిదారీ మార్గం ఎంచుకున్నవారికీ, భూస్వాములకు, ధనిక రైతులకు, విప్లవ ప్రతీఘాతకులకు, చెడు శక్తులకు, మితవాదులకు కూడా యిది వర్తిస్తుంది.
- అమెరికా సామ్రాజ్యవాద సంస్కృతీ ప్రభావంవల్ల చైనా యువకుల్లో విప్లవ దీక్షస్థానే సుఖజీవన కాంక్ష పెరగటాన్ని గమనించిన మావో సిద్ధాంతక్షాళనకు స్వయంగా నిర్ణయించారనే వార్త వెలుగులో కొచ్చింది.

**బ్రాడ్ షీట్ పత్రికలో డేవిడ్ క్రూక్**

మనం పరిచయం చేసుకుంటున్న మరో వ్యాసం **డేవిడ్ క్రూక్** ది. బ్రిటన్, దేశంలో 'చైనా విధానాలను అధ్యయనం చేసే' బృందం ఒకటి వుండేది. వారు 'బ్రాడ్ షీట్' అనే పత్రిక నడిపేవారు. అందులో డేవిడ్ క్రూక్ రాసిన వ్యాసానికి అనువాదం 1966లో 'జనశక్తి' పత్రిక ప్రచురించింది. ఇది సాంస్కృతిక విప్లవం ప్రారంభమవుతూన్న కాలం నాటిది. 20 సంవత్సరాలపాటు చైనా గ్రామీణ ప్రాంతాలలో జీవించిన డేవిడ్ క్రూక్, తన సహచరితో కలిసి చైనాలో సంభవిస్తూండిన ఆర్థిక - సాంఘిక పరిణామాలపై రెండు పుస్తకాలు రాశారు.

**చైనాలో పారిశ్రామిక పురోగతికి చోదక శక్తులు** అనే శీర్షికతో వెలువడిన ఈ వ్యాసం సాంస్కృతిక విప్లవాన్ని ప్రజల మనసుల్లో, చేతల్లో సాగుతున్న వర్గపోరాటంగా అభివర్ణించారు. వ్యక్తిగత ప్రోత్యాహకాల(ఇన్సెంటివ్స్) కోసం పనిచేయటంకాక, సాటి ప్రజలకోసం తద్వారా దేశంకోసం పనిచేయటమనే దేశభక్తిని పెంపొందించుకుంటున్న నాటి పరిస్థితిని ఈ వ్యాసం ప్రతిబింబిస్తుంది. "ప్రజలకు సేవ చేయండి" "నార్మన్ బెతూన్ ఆదర్శం' 'పర్వతాలను తొలగించిన మూర్ఖుడు'లాగా కష్టపడితే ఎన్ని అడ్డంకులనైనా అధిగమించ గలమనే శ్రమించే తత్వానికి, సమష్టి భావనకు ప్రాధాన్యతనిచ్చే విధంగా సమన్వయించి సమగ్ర అభివృద్ధి పథాన్ని రూపొందించుకున్నారు. నార్మన్ బెతూన్ త్యాగం నుండి అంతర్జాతీయ స్ఫూర్తిని పొందారు.

డేవిడ్ క్రూక్ వ్యాసం ప్రకారం ఆనాడు 'రాజకీయ సిద్ధాంత కార్యక్రమం'పైనా "సోషలిస్టు విద్యపైనా" కేంద్రీకరిస్తూ చైనా కమ్యూనిస్టుపార్టీ చైనా ప్రభుత్వం కృషి సాగిస్తూండినాయి. ఒక చైనీయ కార్మికుడు చెప్పినట్లు-"నీవు ముందుకు తేవాల్సింది రాజకీయాలుగాని డబ్బు కాదు. ప్రోత్సాహక బహుమతులనేవి, వ్యక్తుల్ని తమను గూర్చి మాత్రమే ఆలోచించేటట్లు చేస్తాయి కానీ, ఇతరులను గూర్చి ఆలోచించనీయవు".

కేవలం "ఉత్పత్తి సంబంధాలలో విప్లవాత్మక మార్పులవల్ల మానవుని ఆలోచనా ప్రవర్తనలు వాటంతటవే విప్లవాత్మక మవుతాయన్న నమ్మకం"- అది బూర్జువా వ్యక్తివాద ధోరణిని ప్రోత్సాహపర్చడమేనని, ఇది రివిజనిజానికే దారితీస్తుందని చైనావారు చెప్పినట్లు డేవిడ్ క్రూక్ రాశారు.

**మలుపు తిప్పిన మహా ఉద్యమం**

ఇప్పటివరకు మనం పరిచయం చేసుకున్న వన్నీ 1966-68ల నడుమ 'జనశక్తి' పత్రికలో వెలువడిన వ్యాసాలు. మిగిలిన రెండింటిలో మొదటిది విలియం హింటన్ అనే ప్రఖ్యాత అమెరికా జర్నలిస్టు (ఫాన్షెన్-విముక్తి-అనే పుస్తక రచయిత) అమెరికాలో 1971లో చేసిన ప్రసంగాలు "మలుపు తిప్పిన మహా ఉద్యమం"గా పుస్తకరూపం పొందింది. దీన్ని 2016లో విరసం ప్రచురించింది. ఆ పుస్తకంలోని 4వ అధ్యాయమైన "దాడి-ప్రతిదాడి"ని మన పరిశీలనలో వున్న చైనా సాంస్కృతిక విప్లవంలో కూర్చారు. ఈ వ్యాసంలోని కొద్ది వాక్యాలు చూద్దాం.

- "దోపిడీ వర్గాల పాత భావాలను, సంస్కృతిని, ఆచారాలను, అలవాట్లనూ తోసిపుచ్చి, విడనాడి" "శ్రామిక వర్గానికి చెందిన నూతన భావాలను, సంస్కృతిని, సాంప్రదాయాలను, అలవాట్లను" నేర్చుకో వాలని మావో యువతను ప్రోత్సహించారు.
- చైనాలోని ప్రధాన నగరాలన్నింటిలోనూ రెండు పక్షాలూ లక్షలాది మందితో ప్రజా ప్రదర్శనలను జరపటం సర్వసాధారణమై పోయింది.
- ప్రజాసంఘాల మధ్య వివాదాలలో హింసను ఉపయోగించరాదని ఏప్రియల్ నెలలో ప్రజావిముక్తి సైన్యానికి ఖచ్చితమైన ఆదేశాలు అందాయి.
- తిరుగుబాటుదారులు నిజంగానే అధి కారాన్ని స్వాధీనం చేసుకుంటారని తెలుసుకున్న "పెట్టుబడిదారీ మార్గాన్ని అవలంబిస్తున్న పార్టీ అధినేతలు" దాన్ని అరికట్టటానికి తమవద్ద వున్న అన్ని సాధనాలను వినియోగించారు. అందులో భాగంగా ఆర్థికవాదాన్ని ప్రయోగించారు. కొన్ని సందర్భాలలో తప్పుడు అధికార స్వాధీనాలు చేపట్టారు. అలా చేశాక నూతన విప్లవ కమిటీల పేరుపై, తిరుగుబాటుదారుల చర్యలను అణచి వేశారు. కొన్ని ప్రాంతాలలో సాయుధ బలగాలను వాడుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాయుధ బలగాలు విప్లవకర వామపక్షాన్ని ఆయుధాలతో కాక రాజకీయంగా బలపర్చాలని మావో, లిన్ పియావోలు ఆదేశించారు". (పుట 106)

**చౌ ఎన్‌లైతో ఇంటర్వ్యూ**

ఈ పుస్తకంలో అన్నిటికన్నా పెద్దది చౌఎన్‌లైతో విలియం హింటన్ (1971లో) చేసిన ఇంటర్వ్యూ. ఇందులో హింటన్ అడిగిన 22 ప్రశ్నలకు చౌఎన్‌లై సమాధానాలుంటాయి. వీటిల్లో సాంస్కృతిక విప్లవం నిర్వహించాల్సిన తప్పనిసరి చారిత్రక పరిస్థితులను చౌ వివరించారు. సోషలిజంవైపు సాగించాల్సిన ప్రయాణాన్ని అడ్డుకోవటానికి కమ్యూనిస్టు పార్టీలో, ప్రభుత్వంలోనూ ఉన్నత స్థానాలలో వున్న వ్యక్తులే ఎలా ప్రయత్నించారో, వాటినెలా తిప్పికొట్టారో చెప్పారు. మితవాదులే అతివాద రూపమెత్తి దాడులు చేసిన తీరుల్ని వివరించాడు. ఒక ఆదర్శంగా 'తాచాయ్' ప్రాంతం ఎలా నిలిచిందో ఉదహరిస్తూ దేన్నీ మక్కికి మక్కి అనుసరించకూడదనీ సృజనాత్మకంగా అన్వయించు కోవాలనీ చెప్పారు. రష్యాలో పరిణామాలను, స్టాలిన్ నిర్వహించిన మహత్తర చారిత్రక పాత్రనూ(కొన్ని పొరపాట్లున్నప్పటికీ), కృశ్చేవ్ రివిజనిజం యొక్క బూర్జువా స్వభావాన్నీ వెల్లడించాడు. సోషలిస్టు విద్యా ఉద్యమంపట్ల విభిన్న వైఖరులను చెబుతూ ప్రతివొక్కరూ ఆచరణలో పరీక్షింపబడాలన్నారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సరిగా నిర్వహించకపోతే కమ్యూనిస్టు నాయకులే 'రాజు'గానో నిరంకుశ ప్రభువులుగానో మారి మోసగాళ్ళుగా, పెట్టుబడిదారీ మార్గానికి అంకురాలుగా మారే ప్రమాదముంటుందని చెబుతూ సాంస్కృతిక విప్లవమనేది మళ్ళీ, మళ్ళీ కూడా అవసర మవుతాయని హెచ్చరిస్తాడు. చివరగా...

**"చరిత్రని, కమ్యూనిస్టు పార్టీ చరిత్రని, రెండు పంధాల పోరాటాన్ని ప్రజలను విజ్ఞాన వంతులను చేసే వైఖరి గురించిన పోరాటాన్ని చారిత్రకంగా అధ్యయనం చేసి ఉపయోగించు కోవాలి. మావో సేటుంగ్ చెప్పినట్లు "చారిత్రక అనుభవాలు బాగా అధ్యయనం చేయాల్సినవి. ఒక పంధా లేదా ఒక దృక్పధం పదేపదే వివరించ బడాలి. మనం దాన్ని ప్రతి ఏడాదీ, ప్రతినెలా, ప్రతిరోజూ చెప్పాలి". దీన్ని కొద్దిమందికి వివరించటం సరిపోదు. ఈ విషయాలన్నీ విశాల విప్లవ ప్రజానీకానికంతటికీ తెలియజేయాలి".**

**ముగింపు:**

ప్రపంచ కార్మికవర్గ ఉద్యమ చరిత్ర నూరేళ్ళకాలంలో (1871 నుండి 1971 వరకు) జరిగిన ప్రాముఖ్యంగల పోరాటాలు పారిస్ కమ్యూన్(1871); సోవియట్ విప్లవం(1917) చైనా విప్లవం (1949) చైనాలో సాంస్కృతిక విప్లవం(1966-69). కారల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు జీవించిన కాలంలో జరిగిన పారిస్ కమ్యూన్ తిరుగుబాటునీ, దాని ఓటమినీ వివరించి విశ్లేషించి, తాము కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన కార్మికవర్గం నాయకత్వాన విప్లవాలు సంభవించే కాలం ఆసన్నమయిందన్న దానికి ప్రత్యక్ష సాక్షిగా పారిస్ కమ్యూన్ నిలిచిందని చూపారు. యధాతధంగా బూర్జువా రాజ్యాంగాన్ని వినియోగించుకోగలమనే భావన తప్పు అని బోధించారు. కా॥లెనిన్ - స్టాలిన్‌లు సోవియట్ విప్లవ అనుభవాలను, గుణపాతాలను ప్రపంచ కార్మికవర్గానికి అందించారు. సోషలిస్టు పరివర్తన అన్నది తీవ్ర వర్గపోరాటంగా నిలిచిన అనుభవాన్ని బోధపర్చారు. రైతాంగ ప్రధానమైన అర్ధవలస- అర్ధఫ్యూడల్ దేశాలలో నూతన ప్రజాస్వామ్య విప్లవ కార్యక్రమం-ప్రజాయుద్ధ పంధాలను చైనా విప్లవానుభవాలనుండి కా॥మావో విడమరిచారు. అంతేకాక మార్క్సిస్టు మహోపాధ్యాయులందరూ వారి వారి కాలాలలో, సామ్రాజ్యవాద అభివృద్ధి నిరోధక ముఠాలతో ప్రపంచ విప్లవశక్తులు సాగించాల్సిన పోరాటాలకు అనేక విధాలుగా మార్గదర్శకాన్ని అందించారు.

మార్క్స్ - ఏంగెల్స్‌ల కాలంలోనే పారిస్ కమ్యూన్ ఓటమి పాలయింది. అయినా ఓటమి నుండి కూడా నేర్చుకోవలసినదెంతో వుంటుందని వారు బోధించారు. చైనాలో ముఖ్య నాయకులు కామ్రేడ్స్ మావో - చౌఎన్‌లై - ఛూటేలు ఒకే సంవత్సరం - 1976లో చనిపోయిన కొద్ది సంవత్సరాలకు, సాంస్కృతిక విప్లవంలో వెనక్కి నెట్టివేయబడిన రివిజనిస్టులు పైచేయి సాధించి క్రమేణా దాన్ని పెట్టుబడిదారీ మార్గంవైపుకి మళ్ళించారు. నేటి చైనా ప్రపంచ వాణిజ్యంలో అమెరికాతో పోటీపడే స్థాయిలో అభివృద్ధిచెంది వుండినా, దేశీయంగా పెరిగిపోతున్న వర్గ వైషమ్యాలు, సామాజిక అసమానతలు, అది పెట్టుబడిదారీ పంధాలోకి దిగజారిపోయిందని రుజువు చేస్తున్నాయి. వారు తీసుకుంటున్న జాతీయ, అంతర్జాతీయ వైఖరులు కూడా దీన్నే స్పష్టం చేస్తున్నాయి. కామ్రేడ్స్ స్టాలిన్, మావోల నాయకత్వం ప్రపంచ కార్మికవర్గానికి అందించిన మార్గదర్శకత్వంతో పోల్చుకుంటే తేడా మనకు బాగా అర్ధమవుతుంది. అలాగే కృశ్చేవ్ - గోర్బచేవ్‌లతో ప్రస్తుత నాయకత్వానికుండే సామ్యాన్ని పరిశీలించినా తెలుస్తుంది. అలాంటి ప్రయాణాన్ని అరికట్టటానికి జరిగిన మహత్తర ప్రజాఉద్యమమే చైనాలో సాంస్కృతిక విప్లవం. మావో మాటల్లో క్లుప్తంగా ఇదీ - "విప్లవాన్ని అవగాహన చేసుకోండి, ఉత్పత్తిని పెంచండి" "సోషలిస్టు చైతన్యం, సాంస్కృతిక చైతన్యంగల కార్మికుల"ను శిక్షణద్వారా తయారుచేయటమే విద్యకు లక్ష్యం. అంతేగాని విప్లవ రాజకీయాల నుండి, ఉత్పత్తినుండి కార్మికుల రైతుల జీవితాల నుండి వేరుపడిన మేధో కూలీలను తయారు చేయటంకాదు.

నేటి ప్రపంచ కార్మికోద్యమానికి, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడే వివిధ దేశాల జాతీయశక్తులకూ మార్గదర్శకంగా, సంప్రదింపుల కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో ఆమోద యోగ్యమైన కేంద్రం లేదన్నది చేదు నిజం. అయినపప్పటికీ ప్రముఖమైన మహోద్యమంగా చరిత్రలో నిలిచిన చైనాలో సాంస్కృతిక విప్లవాన్ని ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు అధ్యయనం చెయ్యాలి. అవగాహన చేసుకోవాలి. దానినుండి తగిన గుణపాతాలను నేటి, భవిష్యత్తరాలకు అందించాల్సిన కర్తవ్యం వుంది. దాన్ని విస్మరించటమో, అసలు అక్కడ జరిగిందంతా అరాచకమో, అతివాదమోనని కొట్టిపారేసి-నేటి తరాలకు దాని విశిష్టతను చర్చించుకునే అవకాశాన్ని కూడా యివ్వకపోవటం తీవ్రమైన భావదారిద్ర్యంగానే పరిగణించాల్సి వుంటుంది.

నిజానికీ పుస్తకంలోని వ్యాసాలలో మన దేశస్తులు రాసినవన్నీ మన పార్టీ పత్రికల్లో వచ్చిన, ఒకనాటి మన పార్టీ నాయకులు రాసినవే. 1966 - 67 సంవత్సరాలలో సాంస్కృతిక విప్లవాన్ని సమర్థిస్తూ వారు రాసిన వ్యాసాలకు వారు తదనంతర కాలంలో బాధ్యత వహిస్తూ నిర్వహించవలసిన కర్తవ్యాన్ని ఎందుకు పక్కన బెట్టారో నేటి కమ్యూనిస్టు ఉద్యమ అభిమాను లందరూ పునరాలోచన చేసుకోవాల్సిన అవసరం వుంది. ఆ నాయకులే ఒకసారి సోషలిజంలోకి ప్రవేశించిన దేశం తిరిగి పెట్టుబడిదారీ దేశంగా మరలటం వుండదుగాక వుండదని కార్యకర్తలను భ్రమలుపాలు కావించిన వాస్తవం - రష్యా విషయంలో - మనకుంది. చరిత్ర అందించిన పాఠాలను, గుణపాతాలను తిరస్కరించేవారు భవిష్యత్తుని నిర్మించలేరు. ఎంతో బరువైన దైనప్పటికీ, ఆ బాధ్యత మన తరం మీద వుంది. కనుక నేటి కమ్యూనిస్టు శ్రేణులు చైనా సాంస్కృతిక విప్లవాన్ని గురించి తెలుసుకోవటానికీ, దాన్ని అధ్యయనం కావించే వైపు ప్రయత్నించటానికీ ఈ పుస్తకం తొలి పాఠాలను అందించేదిగా వుంటుంది. అందరూ ఈ పుస్తకాన్ని చదివే ప్రయత్నం చేయటం అవసరం.

ooooo